# ధర్మం నీడలో....

ఆ జంక్షన్‌లో నాలుగు రిక్షాలున్నాయ్. బీడీలు కాల్చుకొంటూ కబుర్లు చెప్పుకొంటున్నారు. ఎదురుగావున్న వీధిలోంచి వస్తూన్న రామారావు దంపతుల్ని చూసి బీడీ పీకను పారేసి, రిక్షాను ముందుకు తోసుకొనివాళ్లని సమీపించాడొక రిక్షా డ్రైవరు.

"రిక్షా కావాలేంటి బాబూ!" అడిగాడు ఆశగా.

కావాలన్నట్లు తలూపాడు రామారావు.

"ఎక్కండిబాబూ !" రిక్షాని మరికొంచెం దగ్గరగా లాగాడు రిక్షా డ్రైవరు.

రామారావు రిక్షా ఎక్కలేదు. కాస్త ఎడంగా జరిగాడు. అతని భార్య అలివేలు కూడా భర్త పక్కనే నిలబడింది.

"ఎక్కడి కెళ్లాలి బాబూ?" అడిగాడు.

"రైలు స్టేషనుకి !"

"అలాగే బాబూ!" ఎక్కండి!"

"ఎంత కావాలి?"

"తవర్కి తెల్దేటిబాబూ!" ఎక్కండి!" తొందర చేశాడు.

"ఎంత కావాలో చెప్పు!" రెట్టించాడు రామారావు.

"పై వూరోళ్ళలా బేరం సేత్తారేటి బాబూ తవరు ప్లీడరు గారింట్లో వుంటున్నారు కదండి! తవరికి తోచినంతివ్వండి! కష్టం తెల్సినోరు!"

"అది కాదయ్యా ఎంత కావాలో చెప్పు! నచ్చితే ఎక్కుతాం! లేకపోతే మరోటి చూసుకొంటాం!" నిక్కచ్చిగా అన్నాడు రామారావు తర్వాత వాడితో గొడవలు పడలేక.

"అయిదు రూపాయలివ్వించండి!"

షాక్ తిన్నట్లు ఫీలయ్యాడు రామారావు.

"అయిదు రూపాయిలే!" ఆశ్చర్యం ప్రకటించింది అలివేలు.

"ఏటమ్మగోరూ అలా అంటారు! అన్ని ధరలుమండిపోతున్నాయ్! తవర్కితెల్దేటి!"

"రెండున్నరిస్తా!" అన్నాడు రామారావు.

చీకాకేసింది రిక్షా డ్రైవరుకి.

"బజారుకెళ్తేనే, రెండున్నరిస్తారు! మరో అంత దూరం వెళ్ళాలి! ఇద్దరు మనుషులు! నాలుగు రూపాయిలివ్వించండి!"

"నీతో బేరం కుదిరేలా లేదయ్యా మరో రిక్షాలో పోతాం! ఏయ్ రిక్షా! ఎదురుగా వున్న మూడు రిక్షాలవైపు చూస్తూపిల్చాడు. వారు ఆ బేరాన్ని కనిపెడూతునేవున్నారు. వాళ్ళలో కట్టుబాటుంది. మొదటి రిక్షాడ్రైవరు పూర్తిగా వదలుకుంటేనే తప్ప రెండోవాడు రంగంలోకి దిగడు.... లేదా వాడు అనుమతిస్తే ముందుకొస్తాడు. అందుకే రామారావు పిలుపుకి రెస్పాన్సు రాలేదు.

"నాలుగు రూపాయిలివ్వించండి బాబూ! అంతా ఎక్కుడి! బండిని లాగాలి!" మళ్ళీ మొదలుపెట్టాడు మొదటివాడు.

"మీ రిక్షావాళ్ళతో వచ్చిన చిక్కిదేనయ్యా! న్యాయంగా అడగరు!" విసుక్కొన్నాడు రామారావు.

"ఏటండోయ్! రిక్షావాళ్ళని అంతి యినసాల్టుగా మాటాడుతున్నారు! మాటలు జాగర్తగా రానీయండి! మాలో న్యాయం లేదంటారా? మరి తవర్లో వుందేటి! ఆఫీసుల్లో అన్నింటికి లంచాలు! తేరగా సంపాయించాలని సూత్తారు మాది రెక్కల కష్టం! కండలు కరిగించి డబ్బు చేసుకొంటాం! మీలా గాదు!"

కన్నుమన్నాడు రిక్షావాడు. వాడిది అకారణ ఆగ్రహంగాతోచింది రామారావుకి. తానేమంటున్నాడని అంతకోపం! న్యాయంగా అడగమన్నాను అంతేగా! అయినా వాడితో యింక మాట్లాడ్డం అనవసరం. తనకి టైమవుతోంది.

"వాడితో మనకేవిటండి గొడవ! మరో రిక్షలో పోదాం!" విసుక్కొంది అలివేలు.

"పెద్దోరు!" వాడు వీడు అనకండమ్మా! మేమేం మీ కూలోళ్ళంగాదు! రిక్షా కార్మికుడంటే అంత అలుసుగా తీసుకోకండి! చెమటోడ్చి ప్రతి రక్తబిందువునీ డబ్బుగామార్చుకొంటాం! ఇతరుల సొమ్ముని అన్నాయంగా తీసుకోం! అది ఆఫీసు గుమాస్తాలకీ అఫీసర్లకీ చెల్లింది!"

వాడితో ఎలా మాట్లాడిన తగువుగానే తోచింది.

"చూడు బాబూ! మీ పేరేంటో తెలీదు! మీరు అడిగినంత డబ్బు యిచ్చుకొనే శక్తి మాకు లేదు! మమ్మల్ని వదిలిపెట్టండి!" మాటలు మర్యాదాగా వచ్చినా హేళనధ్వనించింది రామారావు ఉచ్చారణతో...

"ఆఖరిమాట! మూడు రూపాయిలివ్వించండి" కిందికి దిగాడు రిక్షాడ్రైవరు.

"పోదామండి రిక్షాలో! మూడు రూపాయిలకి వస్తాడట!" ముందుకి అడుగు వేస్తున్న భర్తని ఆపాలని ప్రయత్నించింది అలివేలు.

"వాడి రిక్షామనకొద్దు!" కసిగా అనేసి ముందుకు నడక సాగించాడు రామారావు.

భర్తను అనుసరించింది అలివేలు. రిక్షావాడు వాళ్ళని వెంబడించడం ఆ దంపతులు గమనించలేదు.

ఏభైగజాల దూరం నడిచాక మరో రిక్షా ఎదురైంది.

"స్టేషను కొస్తావా!" అడిగాడు.

"సిత్తం! నాలుగు రూపాయి లివ్వించండి!"

"మూడు రూపాయిలిస్తా!"

"ఎక్కండిబాబూ!" అంటూ రిక్షాని ముందుకు లాగాడు. ఇద్దరూ ఎక్కి కూర్చున్నారు. రిక్షా సీటుమీద కూర్చుని పెడలు వేయబోయాడు రిక్షా డ్రైవరు. అంతలో మొదటి రిక్షావాడు తన రిక్షాని ఆ రిక్షాకి అడ్డంగా అపాడు.

"ఆ మూడు రూపాయలకే నేనే వస్తానన్నాను! నారిక్షాయే ఎక్కండి!" డబాయించాడు.

రిక్షాదిగి రామారావు వైపు చూసాడు రెండో రిక్షావాలా.

"నువ్ పోనీయవోయ్! అవతల రైలు టైమవుతోంది" చీకాకు పడ్డాడు రామారావు.

"ఎట్లాగెల్తాడో నేను సుత్తా!" హుంకరించాడు మొదటివాడు. రిక్షా హేండిల్ మీదనున్న చేతుల్ని తీసేసి ఎడంగా నిలబడ్డాడు రెండోవాడు.

"నాయిష్టం వచ్చిన రిక్షాలో వెళ్తా! నీ డబాయింపేవిటోయ్!" కస్సుమన్నాడు రామారావు.

"కళ్ళెర్ర జేసినంత మాత్రాన బెదిరిపోనండోయ్! మొదట నారిక్షా బేరం చేసారు! ఆ మూడు రూపాయలకే నేనూ వత్తానన్నా! నా రిచ్చాలోనే ఎల్లాలి!"

వారిద్దరూ తేల్చుకొంటేనే గానీ తన రిక్షా కదలడానికి వీలులేని పరిస్థితిలో పడ్డాడు రెండోవాడు. అంతలో వెనుక నుండి మరోనాలుగు కాళీరిక్షాలొచ్చి ఆ రిక్షా చుట్టూ ఆగాయ్.

"అవునండి! ఆడూ మూడు రూపాయలకే వత్తానన్నాడు! రావులుగాడి రిచ్చాలోనే ఎళ్ళాల!" తీర్పు యిచ్చాడొక డ్రైవరు.

"మొదట ఒక రిచ్చా బేరంచేసి తర్వాత మరోబండిలో ఎల్తే ఎలాగండి!" రామారావుని తప్పు పట్టాడు మరొకడు.

"దిగండి! దిగండి! రావులి రిచ్చాలోనే ఎళ్ళండి!" హెచ్చరించాడు యింకొక రిక్షావాలా.

రామారావుకి నోటమాట రాలేదు ఏకాకి అయిపోయాడు. దిక్కుతోచని

పరిస్థితిలో పడ్డాడు. రిక్షా దిగలేదు. అంతలో ట్రాఫిక్ పోలీసు ఈల వేసుకొంటూ వస్తూంటే రామారావుకి కొండంత ధైర్యం వచ్చింది.

"ఏంటయ్యా గొడవ! ట్రాఫిక్ జామైంది పొండిపొండి!" అదిరించాడు రిక్షా డ్రైవర్లని-వాళ్ళు అదరలేదు! బెదరలేదు!.

తనరాకనే గమనించనట్లు వాళ్ళు ప్రవర్తిస్తూంటే రామారావుని మందలించాలను కొన్నాడు కానిస్టేబులు.

" ఏవిటి మాష్టారూ గొడవ!" విసుక్కొన్నాడు.

"చూడండి కానిస్టేబులుగారూ! మూడు రూపాయిలకి బేరం చేసుకొని వెళ్తుంటే వీళ్ళంతా మారిక్షాని కదలనీయడం లేదు! నేనుకూడా ఆ మూడు రూపాయలకే వస్తానూ నా రిక్షాలోనే వెళ్ళాలని పేచీపెడ్తున్నాడు!" ఫిర్యాదు చేసాడు రామారావు.

"అదికాదు వెంకటస్వామిగారూ! మొదటనా రిక్షాబేరం చేసారు! మూడు రూపాయలకి వస్తానన్నాను! నారిక్షా వదిలేసి సోవులుగాడి రిక్షాలో ఆ మూడురూపాయలకే ఎల్తానంటున్నారు!" వివరించేడు రావులు. "స్టేషన్‌కి నాలుగు రూపాయలకి తక్కువ రానన్నాడండి! వేం వచ్చేస్తుంటే, మూడు రూపాయలకి వస్తానన్నాడు. ఇంకా తగ్గుతుందేవోనని నడుచుకొంటూ వస్తున్నాం! ఇతను కూడా మూడు రూపాయలే అన్నాడు. ట్రైన్ టైమవుతోంది. ఈ రిక్షాలో పోతున్నాం! వాడి రిక్షాకోసం వెనక్కి వెళ్ళగలమా చెప్పండి!". జరిగినదంతా చెప్పాడు రామారావు.

"మొదట బేరం చేసిన రిక్షావుందిగాదా! ఆ రిక్షాలోనే ఎళ్ళడం ధర్మం మీరేచెప్పండి ఎంకటస్వామిగారూ!" -- వేరే రిక్షావాలా.

"ఇయ్యేల ఈడికైంది! రేపు మరోడికౌతాది! ఇలాఅయితే బతగ్గలమా, మా కడుపుమంట కొద్దీ ఎక్కువే అడుగుతావనుకోండి! అడిగినంత యిత్తారుటండి పాసింజర్లు! అసలు రేటుకే దిగుతారు! అంతమాత్రాన రిచ్చా మారిపోవడమే? అదేంన్యాయం! మీరేసెప్పండి బాబూ!" మరో వృద్ధ రిక్షాడ్రైవరు అభ్యర్థన.

ధర్మసంకటంలో పడ్డాడు వెంకటస్వామి ట్రాఫిక్ పూర్తిగా స్థంభించి పోయింది. బస్సులూ, టాక్సీలూ, కార్లూ గోలపెడ్తున్నాయ్. పోలీసాఫీసర్లు ఎవరైనా చూస్తే తనకి చీవాట్లు తప్పవ్. ఆలోచనలో పడ్డాడు వెంకటస్వామి.

"చూడండి మాష్టారూ! అ డబ్బుకే మొదటి రిక్షాడ్రైవరు రావులు వస్తానంటున్నాడు కదా! ఆ రిక్షాలో వెళ్ళడమే ధర్మం! ఏ రిక్షాఅయితే మనకేటండి! స్టేషనుకి పోవాలి అంతేకదా!" నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు వెంకటస్వామి.

"అవును బాబూ! ఆడిరిచ్చాలోనే ఎల్లండి అదేనాయం!" తన అభిప్రాయాన్ని చెప్పాడు రెండో రిక్షావాడు. ఇక చేసేది లేక మొదటి రిక్షాలోకి మారారు అదంపతులు!

తమ ఆఖరి అమ్మాయి పెళ్ళి విషయమై మాట్లాడేందుకు, అమ్మాయి అలివేలుని తీసుకొని తప్పకుండా రమ్మని మంగళగిరిలో ఆఫీసరుగా పనిచేస్తున్న మావగారు రామారావుకి లెటరు రాసారు. బెర్తులు రిజర్వు చేయాలి. ఉదయాన్నే స్టేషన్‌కి బయలుదేరాడు. బుకింక్ తెరిచేందుకు ఇంకా అరగంట టైముంది. అయినా అప్పటికే పదిమంది క్యూలో నిలబడి ఉన్నారు. తన ముందున్న వారినందర్నీ ఎంక్వయిరీ చేసాడు. ఎవరు ఏ ట్రైన్‌కి ఏ ఊరికి ఏ తేదికి రిజర్వు చేయించుకొందుకొచ్చారో తెల్సుకొన్నాడు. ఒకడు మాత్రం తనతో పోటీకి రెండు బెర్తులకోసం ముందు నిలబడి వున్నాడు. రిజర్వేషన్ బోర్డు ఖాళీవున్నట్లు చూపిస్తోంది. నాలుగు బెర్తులు కాళీవుంటే చాలు! ముందున్నవారికి రెండూ, తనకు రెండూ, రిషర్వేషన్ కౌంటర్ తెరువబడింది. ఆతృతగా వెళ్ళి ఎన్ని బెర్తులు ఖాళీలున్నాయో తెలుసుకొన్నాడు. అయిదు మాత్రమే ఖాళీవున్నట్లు తెలిసింది. ధీమాపడ్డాడు రామారావు. ముందున్నవారు కదిలేసరికి ముప్పావు గంట పట్టింది. రామారావు టర్నువచ్చింది. డబ్బు స్లిప్పు అందివ్వబోయాడు. ఆ క్లర్కు ఏదో రాసుకొంటున్నాడు. అందుకోలేదు వెంటనే, అంతలో ఒక యువకుడు వేరే మార్గంద్వారా సరాసరి లోనకి వెళ్ళాడు. అతణ్ణి కౌంటరు గుమస్తాలందరూ నవ్వు మొహంతో పలకరించారు.

"సార్ డబ్బుతీసుకోండి! టైమవుతుంది!" తొందర చేశాడు రామారావు.

"ప్లీజ్ వెయిట్!" మర్యాదగా అన్నాడు గుమస్తా. ఆ వ్యకి ఆ గుమస్తాకి స్లిప్పు డబ్బు అందించాడు.

"గూడూరు మూడు!" అన్నాడు చిటికెలో మూడు టికెట్టు అందించాడు గుమస్తా. థాంక్స్ చెప్పి వెళ్ళిపోయాడా యువకుడు.

"ఆ చెప్పండి మాష్టారూ! ఏట్రైన్, ఏ తేది ఏ వూరు?" అడిగాడు గుమస్తా.

సమాధానంగా స్లిప్పు డబ్బు అందివ్వబోయాడు రామారావు. అతను డబ్బు తీసుకోలేదు. స్లీప్ మాత్రం చూసి తిరిగిచ్చేస్తూ 'సారీసర్! ఖాళీలులేవు!" విచారం వ్యక్తం చేసాడు.

ఖంగు తిన్నాడు రామారావు. సహనం నశించింది.

"కౌంటర్ ఓపెన్ చేయడానికి అరగంట ముందువచ్చా? ఓపెన్ చేయగానే అడిగితే ఐదు బెర్తులు ఖాళీలున్నాయన్నారు! నాముందు వారికి రెండిచ్చారు! ఇంకా మూడుండాలి!" అడిగాడు కోపంగా.

"అయిపోయాయ్ అన్నాకదండి! అంతే!" అతని నిర్లక్ష్యపుజవాబుకి చిర్రెత్తింది రామారావుకి.

"ఆ పెద్ద మనిషెవరో లోనికి వచ్చి అడిగితే అతనికి మూడిచ్చారు! గంట నుండి క్యూలో నిలబడివున్నాను నాకు లేవంటున్నారు! ముందువచ్చిన వానికీయడం న్యాయం! మరి క్యూలో నిలబడి ఉన్నందుకు ఏం ప్రయోజనం! మీరే చెప్పండి మాష్టారూ! ముందుగా వచ్చిన వానికి లేదనడం ధర్మమంటారా!" వెనుక నున్న పాసింజర్ల వైపు తిరిగి అడిగాడు రామారావు, వారిమాట సహాయం కోసం. ఎవరూ మాట్లాడలేదు! సరికాదా

"వేగంగా తేల్చండి సార్! మాకు పనుంది!" తొందర చేయసాగారు.

"న్యాయం ధర్మం ఎక్కడుంది మాష్టారూ! మీరే డిపార్టుమెంటులో పని చేస్తున్నారు?" అడిగాడు వెనుకనున్న ఆసామి...

తాను పనిచేస్తున్న డిపార్టుమెంటు పేరు చెప్పలేక పోయాడు రామారావు. చెబితే అంతా విరగవడి నవ్వుతారు! తను హాస్యం పాలవుతాడు! ఆ డిపార్టుమెంటు అలాంటిది! న్యాయం ధర్మం అన్నమాట అక్కడ మాట్లాడ్డానికి వీలులేదు. తానెంత నిప్పులాంటి మనిషో తన ఆఫీసులో అందరికీ తెలుసు! అయినా ఏం ప్రయోజనం. అసమయంలో తన శాఖ పేరుచెప్పడానికి వీలులేదు.

"దయచేసి రిజర్వేషన్ సూపర్వైజరుగారిని కలవండి మీకు నమ్మకం లేకపోతే! అడ్డులెండి! వెనుక పెద్దక్యూ వుంది. క్లియర్ చేయాలి!" మర్యాద చూపిస్తూ, విసుక్కొన్నాడు గుమస్తా.

'ఒకే చెట్టుకాయలు! ఒక కొమ్మకాయలు పుల్లగానూ మరో కొమ్మకాయలు తియ్యగానూ వుంటాయటండీ!" నిరుత్సాహపరిచాడు క్యూలో నిలబడ్డ ఒక పెద్ద మనిషి.

మారు మాటాడకుండా బయట పడ్డాడు రామారావు.

**జాగృతి**

**1984**